క్లుప్తంగా

అమలాపురం డీఎస్పీగా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



అమలాపురం టౌన్: అమలాపురం డీఎస్పీగా ఎం.మహేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ అనకాపల్లి జిల్లా దిశ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సబ్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు రాజీలేని చర్యలు చేపడతానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు తమ పోలీసు సబ్‌డివిజన్ తరఫున గట్టి చర్యలు చేపడతామన్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషాలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు కొత్త డీఎస్పీ మహేశ్వరరావును కలిసి స్వాగతం పలికారు. ఇప్పటివరకూ ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన ఎం.అంబికా ప్రసాద్ రాజమహేంద్రవరం సౌత్ డీఎస్పీగా బదిలీ అవ్వడంతో అక్కడకు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా రజకుల బల్లల పూజ



బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న రజకులు

ముమ్మిడివరం: మండలంలోని తానేల్లంక రజకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బల్లల పూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రజకుల నివాసల నుంచి సంప్రదాయబద్ధంగా బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామ దేవత బలుసులమ్మ ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కుబడులు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘ పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ టెర్మినల్ వద్ద కార్మికుల నిరసన



టెర్మినల్ గేటు ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

అల్లవరం: ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో మెకానికల్ విభాగానికి చెందిన ఏపీ ఇంజినీరింగ్ కంపెనీ కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఉడాయించడంతో ఆ కంపెనీలో విధులు నిర్వర్తించే కార్మికులు గేటు ముందు బైఠాయించారు. ప్రధాన కాంట్రాక్టుదారుడైన టాటా కంపెనీ ఏపీ ఇంజినీరింగ్ కంపెనీకి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. అయితే ఏపీ ఇంజినీరింగ్ కంపెనీ కార్మికులను నిలువునా ముంచి ఉడాయించడంతో మంగళవారం కార్మికులంతా ప్రధాన కాంట్రాక్టుదారు టాటా కంపెనీ వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులతో చర్చించి పది రోజుల్లో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్టీఐ కార్యకర్త, సర్పంచ్‌ల మధ్య ఘర్షణ

అమలాపురం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టం కార్యకర్త, పలువురు సర్పంచ్‌ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధుల విషయంపై చర్చించేందుకు చిందాడగరువు, సమనస, నడిపూడి, ఇమ్మిడివరప్పాడు తదితర గ్రామాల సర్పంచ్‌లు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. వారంతా ఎంపీడీఓ వెంకటేశ్వరరావుతో మాట్లాడుతుండగా అక్కడకు ఆర్టీఐ కార్యకర్త సంకెళ్ల రాంబాబు మరో మహిళతో కలిసి వచ్చారు. ఆర్థిక సంఘం నిధుల విషయంలో అటు సర్పంచ్‌లు, ఆర్టీఐ కార్యకర్త రాంబాబుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ రేగి అది కాస్తా తోపులాటకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పంచాయతీలకు వచ్చే నిధుల్లో తమకు మామూళ్లు ఇస్తేనే అన్నీ ప్రశాంతంగా జరుగుతాయని, లేకుంటే ఆర్టీఐ ద్వారా బయటకు లాగుతానంటూ రాంబాబు బెదిరించారని సర్పంచులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన అనంతరం ఆస్పత్రిలో చేరిన రాంబాబు సర్పంచ్‌లు తనపై దాడి చేశారంటూ ఫిర్యాదుచేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం అయిన తాడి భవానీకి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సమకూర్చిన రూ.10 వేల నగదును మంగళవారం అందించారు. ఎమ్మెల్యే రా పాక తనయుడు వెంకట్‌రామ్, సంస్థ సభ్యులు చేతుల మీదుగా వారికి నగదు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాభిషేకం

- ఉచితంగా అందించిన ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు హక్కు
- సచివాలయాల్లో జోరుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- నిరుపేదల ఇళ్లల్లో పండగ వాతావరణం



అల్లవరం సచివాలయంలో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

అల్లవరం: పేదలందరికీ ఇళ్లు పథకంలో నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాకుండా సదరు స్థలంపై వారికి హక్కు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. గత ప్రభుత్వాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాని వాటిపై హక్కు కల్పించిన దాఖలాలు లేవు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలపై హక్కు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. గత ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలు ఇచ్చినా ప్రభుత్వానికి వాటిని రద్దు చేసే అధికారం ఉండేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా లబ్ధిదారులకు యజమానులుగా హక్కు కల్పిస్తున్నారు. ప్రస్తుతం పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సచివాలయాల్లో జోరుగా సాగుతోంది.

మండలం	సచివాలయాలు	ఉచితంగా పంపిణీ చేసిన స్థలాలు	రిజిస్ట్రేషన్ పూర్తయినవి	కావాల్సినవి
అల్లవరం	23	2532	1335	1197
ఉప్పలగుప్తం	17	1722	707	1015
అమలాపురం రూరల్, అర్బన్	27	4923	1006	3917

అమలాపురం అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం మండలాల్లో 59 సచివాలయాల్లో 6,707 ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఆ స్థలంపై హక్కు కల్పిస్తూ ఈ నెల 2వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టారు. సచివాలయ కార్యదర్శి, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, లబ్ధిదారుని ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసి దస్తావేజులను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పత్రాలు అందుకుంటున్న నిరుపేదల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది.

జగనన్నకు రుణపడి ఉంటాం



మాకు ప్రభుత్వం గోపవరంలోని జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం ఇచ్చింది. అంతే కాదు దానిపై హక్కు కల్పిస్తూ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత పత్రాలు సైతం అందించారు. చాలా సంతోషంగా ఉంది. ఇంత సాయం చేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కాకర నాగలక్ష్మి, గోపవరం, ఉప్పలగుప్తం మండలం

ఏ ప్రభుత్వం చేయని సాయమిది



ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేయని సాయం జగనన్న ప్రభుత్వం చేసింది. ఇళ్ల స్థలంపై హక్కు కల్పించి ప్రతి మహిళని యజమానిగా చేశారు. మాకు బోడసకుర్రులోని జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందించారు. సీఎం జగన్ వల్లే మాలాంటి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి.

– పోతుల వీరవేణి, బోడసకుర్రు, అల్లవరం మండలం

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీతకు సత్కారం



ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీత సుశీలను సత్కరిస్తున్న గ్రామస్తులు

అల్లవరం: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన ఏఎన్ఎం తేజావత్ సుశీలను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గోడిలంక సచివాలయంలో సర్పంచ్ రుద్రరాజు పవిత్ర అధ్యక్షతన మంగళవారం సుశీల దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. విజయవాడలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన గ్రామానికి చెందిన దారా గాయత్రి, ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని సైతం ఇదే వేదికపై గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, నాతి శ్రీనివాసరావు, దత్తుడు రాజు, కాశి అమ్మాజీ, శెట్టిబత్తుల తులసీరావు, కుంచే చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యం



చల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి సచివాలయం–2లో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, వైద్యులు ఢిల్లీ ప్రసాద్, లోవ సుధ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

ఐ.పోలవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఆరోగ్య భరోసా కల్పిస్తోందని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు. మంగళవారం ఐ.పోలవరం మండలం మురమళ్ల–2 సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన దుర్గారావుదొర రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీసి వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరంలో 416 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యకుమారి, కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యులు డీఎస్ గాయిత్రి, ఎంఎస్ రాజేష్‌బాబు, రాజేష్, వి.పూర్ణ ప్రణీత, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానంలో సమూల మార్పులు

- వీరేశ్వరస్వామి ఆలయంలో మెరుగైన సౌకర్యాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న భక్తులు



నూతనంగా నిర్మించిన నిత్యాన్నదాన భవనంలో భోజన ప్రసాదం తింటున్న భక్తులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రోజూ రాత్రి కల్యాణం అనంతరం జరిగే అన్నదానం ఏర్పాట్లలో చేసిన మార్పులపై భక్తుల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆలయంలో రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయంలో గత 12 ఏళ్లుగా జరుగుతున్న అన్నదానంలో భక్తులు బఫే సిస్టంలో ఆరు బయట నిలబడి, నేల మీద కూర్చుని భోజనాలు చేసేవారు. అయితే భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పాలక మండలి అధ్యక్షులు పెన్మత్స కామరాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు వారి సౌకర్యార్థం రూ.55 లక్షలతో నిత్యాన్నదాన భవనానికి శ్రీకారం చుట్టారు. నిత్యాన్నదాన భవనంలో భక్తులు కూర్చుని తినేందుకు వీలుగా రూ.9 లక్షల ఖర్చుతో స్టీల్ బెంచీలు, టేబుళ్లను ఏర్పాటు చేశారు. అలాగే మరో రూ.3 లక్షలతో విశాలమైన వంటశాల నిర్మించారు. ఇటీవలే వాటిని ప్రారంభించడంతో ఆలయానికి వచ్చిన భక్తులు మెరుగైన సౌకర్యాలు చూసి భక్తులు ఎంతగానో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై హర్షం



కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఐ.పోలవరం: స్వాతంత్ర్యోద్యమ పోరాట యోధుడు కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు హర్షం ప్రకటించారు. మంగళవారం ఐ.పోలవరంలోని రామేశ్వరపు శ్రీనివాస్ స్వగృహంలో జరిగిన మండల నాయీ బ్రాహ్మణ సమావేశంలో పలువురు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన ఠాకూర్ విద్యార్థి నాయకుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, అనంతరం బీహార్ ముఖ్యమంత్రి గాను పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. తొలుత కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేటీ శ్రీనివాస్, రామేశ్వరపు శేషగిరి, వి.కాళహస్తి, పి.సత్యనారాయణ, ఎ.రత్నాజీ, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులను సత్కరిస్తున్న కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్

తాళ్లరేవు: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచిన కోరంగి వాలీబాల్ క్రీడాకారులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కోరంగి గ్రామ పంచాయతీ సర్పంచ్ పెయ్యల మంగేష్ జట్టు కెప్టెన్ దాసరి ఉమాశంకర్‌తో పాటు జట్టు సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగేష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రాణించి కోరంగి గ్రామానికి మంచిపేరు తెచ్చారని అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్థాని రామరాజు, ఉప సర్పంచ్ కామాడి బైరవమూర్తి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళా పోలీసుకు రూ.25 వేల ఆర్థిక సాయం



మహిళా పోలీసు విజయలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఓ మహిళా పోలీసు కుటుంబానికి కష్టం వస్తే జిల్లా మహిళా పోలీసులు అంతా అండగా నిలిచారు. అయినవిల్లి మండలం నల్లచెరువు మహిళా పోలీసుగా పనిచేస్తున్న జంగా విజయలక్ష్మి భర్త గత నెలలో కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఈ దంపతులకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. విజయలక్ష్మి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో జిల్లా మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ మానవతా దృక్పథంతో స్పందించి తమ వంతు సాయం అందించింది. జిల్లా మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు కొప్పిశెట్టి వెంకట ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గుంటు నాగ సుశీల, అదనపు ప్రధాన కార్యదర్శి టి.రాజేశ్వరి బాధిత మహిళా పోలీసు విజయలక్ష్మిలు మంగళవారం నేదునూరు వెళ్లి విజయలక్ష్మికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

ఇంటింటికీ మంచినీటి కుళాయిలు



మాధవరాయునిపేటలో పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్‌సాగర్ తదితరులు

తాళ్లరేవు: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు వేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని మాధవరాయుని పేటలో ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి రెడ్డిబాబు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, ఆకుల వెంకటేశ్వర్లు, విత్తనాల రామకృష్ణ, బొంతు మోహన్, పిల్లి పరదేశరావు, కుడుపూడి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమావళి పాటించాలి



ఆటో డ్రైవర్లకు భద్రతా కరపత్రాలను అందిస్తున్న పోలీసులు

అమలాపురం రూరల్: రహదారి భద్రత నియమావళి అనుసరించి మోటారు వాహనాల చట్ట ప్రకారం రోడ్లపై సంచరించే ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ చేసే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాప్‌రావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం భట్లపాలెం, అమలాపురం చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టాలను ఉల్లఘించే వారిపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఏవీఎస్ సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, కేఆర్ రవికుమార్, డి.కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మనోహర్ జోషి

ఉప్పలగుప్తం: ఆటో డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ కె.మనోహర్ జోషి సూచించారు. స్థానిక గ్రామంలోని ది ఉప్పలగుప్తం ఆటో ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసుకున్న సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి తరచూ ఇన్సూరెన్స్‌లు చేయించుకుని, కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, అధ్యక్షుడు కట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంచే రవి, గెద్దా శివ, తోరం శ్రీను, నల్లా ఆదినారాయణ, రవణం పల్లంరాజు, నల్లా దుర్గారావు పాల్గొన్నారు.

యానాం: వాహన చోదకులు రహదారిపై ప్రయాణించేటప్పుడు రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ షణ్ముగం పేర్కొన్నారు. మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద ఆయన జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకుల్లో భద్రతపై చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శేరు నూకరాజు, ఆర్టీఓపీ అంగళన్ పాల్గొన్నారు.

అయోధ్య బాల రాముడికి 16వ రోజు పండగ



కర సేవకుడు ఉమామహేశ్వర శాస్త్రి దంపతులను సత్కరిస్తున్న రామభక్త బృందం ప్రతినిధులు

అమలాపురం టౌన్: అయోధ్యలో బాల రాముడి దివ్య విగ్రహ ప్రతిష్ఠ జరిగిన సందర్భంగా స్థానిక రోటరీ కల్యాణ మండపంలో రామ భక్త బృందంచే 16వ రోజు పండగను మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ఇళ్లలో ఏదైనా శుభ కార్యం జరిగితే 16వ రోజును ఓ పండగలా నిర్వహించడం ఆనవాయితీ కనుక అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ 16వ రోజు పండగను నిర్వహించినట్లు రామభక్త బృందం ప్రతినిధి, ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ అన్నారు. కార్యక్రమంలో కర సేవకులు గొడవర్తి ఉమామహేశ్వర శాస్త్రి దంపతులను సత్కరించారు. ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధి కంకటాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం సమస్యలను పరిష్కరించండి

హోంమంత్రి నమశ్శివాయంతో ఎమ్మెల్యే అశోక్



పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయంతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయంను ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం కలిసి యానాం సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. మత్స్యకారులకు ఓఎన్‌జీసీ సంస్థ ద్వారా రావాల్సిన నష్ట పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. పరిహారం చెల్లించకుండా జాప్యం జరుగుతుండటంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా యానాంలో సబ్‌రిజిస్ట్రార్ నియామకం జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ పరిధిలో పారా టీచర్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని విజ్ఞప్తి చేశారు. ఖాదీ శాఖలో పనిచేస్తున్న మహిళలకు న్యాయం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం హోంమంత్రి నమశ్శివాయం మాట్లాడుతూ యానాం సమస్యలను సీఎం రంగసామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో సిటిజన్ చార్టర్ ఏర్పాటు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆధునికంగా సిటిజన్ చార్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. యానాం ప్రాంతీయ భాష అయిన తెలుగులో అందరికీ అర్థమయ్యేలా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ప్రజల నుంచి వినతుల స్వీకరణ, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, ఎవరిని సంప్రదించాలనే విషయాలతో పాటు ఎన్ని రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందో సైతం బోర్డుల్లో తెలియజేస్తామన్నారు.

మాస్టర్స్ టీ-10లో యానాం విజయం



విజయం సాధించిన యానాం మాస్టర్స్ జట్టు

యానాం: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో జరుగుతున్న మాస్టర్స్ టీ–10 క్రికెట్ టోర్నీలో యానాం మాస్టర్స్, పుదుచ్చేరి నార్త్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో యానాం జట్టు విజయం సాధించింది. మొదట టాస్ గెలిచిన యానాం మాస్టర్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. పుదుచ్చేరి నార్త్ జట్టు 10 ఓవర్లలో 122 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన యానాం మాస్టర్స్ 9.5 ఓవర్లలోనే 123 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. వెంకటేశ్వరరావు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు.

స్నేహితుడి భార్యకు ఆర్థిక సాయం



వీర రాఘవమ్మకు రూ.75 వేల సాయం అందిస్తున్న స్నేహ బృందం

అమలాపురం టౌన్: మూడు దశాబ్దాల క్రితం తమతో కలిసి చదువుకున్న తమ మిత్రుడు చనిపోతే ఆ కుటుంబానికి తోటి స్నేహితులంతా అండగా నిలబడ్డారు. వివరాల్లోకి వెళితే 1993–96లో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో చదువుకున్న యల్లమిల్లి నాగార్జునరావు కరోనా సమయంలో చనిపోయాడు. ఇప్పుడు అతని భార్య వీరరాఘవమ్మ క్యాన్సర్‌తో బాధపడుతుంది. దీంతో నాగార్జునరావుతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులంతా కలిసి రూ.75 వేలను సమకూర్చి మంగళవారం అయినవిల్లి మండలం సిరిపల్లికి వెళ్లి వీరరాఘవమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. తామంతా అండగా ఉంటామని అధైర్య పడొద్దని ఆమెకు ధైర్యం చెప్పారు. సాయం అందించిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పిండి శేషు, సాపే శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి సుబ్బిరామ్, గోకవరపు వరప్రసాద్, గోకవరపు రాంబాబు తదితరులున్నారు.

పోటీపై చర్చలు జరుగుతున్నాయి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి సంబంధించి పోటీ చేసే అంశంపై బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రాథమికంగా చర్చలు జరుగుతున్నాయని సీఎం రంగసామి పేర్కొన్నారు. ఈ నెల 7న 14వ ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించనున్న ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ స్థానానికి తాము పోటీ చేస్తామని ఎన్‌డీఏ ఆధ్వర్యంలోని బీజేపీ నేతలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారన్నారు. అనంతరం మంత్రి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ తన శక్తిని నిరూపించుకోవాల్సి అవసరం ఉందన్నారు.